# మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 163 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | మంగళవారం, 12 మే 2026 | పేజీలు : 4




ఈ ఆఫీస్‌లోనే
## అన్నిఫైళ్లు
- జనగామ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

2

## ధాన్యం కొనుగోలులో ప్రభుత్వాలు విఫలం
- సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి
- జనగామ కలెక్టరేట్ ముందు సీపీఎం ధర్నా

3



# నాణ్యమైన విద్యే లక్ష్యం

- సీఎం రేవంత్ రెడ్డి
- ఘనంగా ప్రారంభమైన విద్యావారోత్సవాలు

**హైదరాబాద్, మన చౌరాస్తా :** నిరుపేద కుటుంబాలకు చెందిన పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలన్న లక్ష్యంతో విద్యా శాఖలో తీసుకుంటున్న నిర్ణయాలు వెనుకడుగు వేయకుండా అమలు చేయాల్సిన బాధ్యత అందరిపైన ఉందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి రెడ్డి అన్నారు. "పాఠశాలలు దేశ భవిష్యత్తు నిర్మాణ వేదికలు. ఆ వేదికలను పునరుద్ధరించే ప్రక్రియకు శ్రీకారం చుట్టాం. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పిల్లలను అనాథలుగా చూడదలుచుకోలేదు. తల్లిదండ్రులు ఎంత జాగ్రత్తతో చూసుకుంటారో అదే రీతిలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలను చూసుకోవాలన్నదే మా సంకల్పం" అని స్పష్టం చేశారు. 'ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా విద్యా శాఖ ఆధ్వర్యంలో ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించిన విద్యా వారోత్సవాల కార్యక్రమంలో ముఖ్యమంత్రి గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యా శాఖ ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను పరిశీలించారు. కోర్ అర్బన్ ఏరియా CURE లో 1011 కోట్ల రూపాయలతో నిర్మించే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, గడ్డం వివేక్ వెంకటస్వామి, మహమ్మద్ అజారుద్దీన్, సలహాదారులు కేశవరావు, హనుమంత రావుతో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, వివిధ యూనివర్సిటీల వైస్ చాన్సలర్లు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "ప్రపంచ వ్యాప్తంగా విద్యా రంగంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. సిలబస్ మారుతోంది. ఏఐ వచ్చింది. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ మారింది. తెలంగాణలో కూడా నూతన విద్యా విధానం అమలు చేయాలని, అదికూడా దేశంలోనే అత్యుత్తమంగా ఉండాలన్న ఆలోచనల మేరకు నర్సరీ నుంచి 12 వ తరగతి వరకుండే విద్యా విధానం అమలు చేస్తున్నాం" అని విడమరిచి చెప్పారు. "పాఠశాలల్లో మౌలిక సదుపాయాలే కాకుండా నిరుపేద కుటుంబాల పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా పాఠశాలల్లో బలవర్ధకమైన ఆహారం అందించాలని నిర్ణయించాం. ప్రభుత్వ పాఠశాల అంటే అమ్మ ఒడిలాంటిది. వారికి ఎలాంటి ఇబ్బందులు రాకూడదు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు చేయబోతున్నాం. విద్యార్థుల కోసం పెట్టే ఖర్చు భవిష్యత్తరాలకు పెట్టుబడిగా భావిస్తున్నాం. భావి తరాలు ప్రభుత్వ పాఠశాలల్లోనే తయారు కావాలి. అందుకు ఉపాధ్యాయులు, అధ్యాపకులు సహకరించాలి. ప్రభుత్వ బడుల్లో చదువుతున్న లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లో ఉంది" అని చెప్పారు. "విద్యా రంగంలో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో ఉండాలన్నది నా ఆకాంక్ష. విద్యా రంగానికి ఏమాత్రం నిధుల కొరత రాకూడదని బడ్జెట్‌లో 8.22 శాతం నిధులను కేటాయించాం. ఇంకా కేటాయించాల్సిన అవసరం ఉంది. అయితే రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల దృష్ట్యా ఒక్కసారిగా కాకుండా ఏటేటా పెంచుకుంటూ 15 శాతం వరకు కేటాయింపులు జరుపుతాం" అని తెలిపారు. 10వ తరగతి పాసైన తర్వాత ఇంటర్మీడియట్ కు వచ్చే సరికి డ్రాపౌట్స్ ఎక్కువగా ఉంటున్నాయని గుర్తించి నర్సరీ నుంచి 12వ తరగతి వరకు కొనసాగే విద్యా విధానం అమలు చేయబోతున్నాం. మొదటగా హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియాలో ఈ విధానాన్ని ప్రారంభిస్తున్నాం. 1.34 కోట్ల జనాభా కలిగిన కోర్ అర్బన్ ఏరియాకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం వస్తున్న నిరుపేద కుటుంబాల పిల్లలకు మెరుగైన విద్యావకాశాలు కల్పించాలని 1700 కోట్ల రూపాలతో అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేశాం. పేదలకు నాణ్యమైన విద్యను అందించడం ప్రభుత్వ గురుతర బాధ్యతగా ఈ కార్యక్రమాలు చేపట్టాం. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే ఉంది. అందుకే నాణ్యమైన విద్యను అందించడానికి ప్రణాళికలు సిద్ధం చేశాం. "విద్యా రంగంలో తీసుకొస్తున్న మార్పులు టీచర్ల కోసమో నాయకుల కోసమో కాదు. అత్యంత నిరుపేద కుటుంబాల పిల్లల కోసం, వారి సంక్షేమం కోసం చేపట్టాం. ఈ విషయంలో ఉపాధ్యాయ సంఘాలు, పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడుతాం" అని ముఖ్యమంత్రి అన్నారు.


## wanted
### విలేకరులు కావలెను




మన చౌరాస్తా తెలుగు దినపత్రిక స్థాపించిన అనతి కాలంలోనే పాఠకుల విశేష ఆదరణ పొందుతూ డిజిటల్ మీడియా రంగంలో దూసుకెళ్తోంది. స్థానిక సమస్యలపై, రాజకీయ, ఎడ్యుకేషన్, ఆరోగ్యం, సినిమా వార్తలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతూ ముందుకు సాగుతోంది. మా పత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను.. పూర్తి వివరాలకు ఈ కింది నంబర్లలో సంప్రదించగలరు.

manachourasta@gmail.com

8555800812 | 9676400812

సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..
## మన చౌరాస్తా
The Complete News way





# ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**జనగామ, మన చౌరాస్తా :** ప్రజావాణిలో వివిధ సమస్యలతో వచ్చే ప్రజల అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఫిర్యాదులను స్వీకరించి పరిశీలించారు. ఈ సందర్భంగా 190 అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు కేటాయిస్తూ, ప్రజా సమస్యలపై తగిన చర్యలు తీసుకొని, త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలని, పెండింగ్ లో లేకుండా దరఖాస్తులను ఎప్పటికప్పుడు పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రజావాణికి వచ్చిన కొన్నింటి దరఖాస్తుల వివరాలిలా ఉన్నాయి

పెద్దమడ్డూర్ గ్రామం, దేవరుప్పుల మండలానికి చెందిన మామిల్ల వినయ్, తాను (బీసీబి) గౌడ్ కులానికి చెందిన వాడని, ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఇసుక కొరకు మనవి చేస్తూ దరఖాస్తు చేసుకున్నారు.

మాణిక్యాపురం గ్రామం, లింగాల ఘనపురం మండలానికి చెందిన సర్పంచ్ విజయ భాస్కర్, ఉప సర్పంచ్ మహేశ్వర్ రెడ్డి, ధాన్యం కొనుగోలు కేంద్రంలో లారీలు రాకపోవడం వల్ల కాంటాలు సరిగా జరగడం లేదని, వెళ్లిన లారీలు వెంటనే దిగుమతి కాకపోవడం వల్ల లారీలు పంపడం లేదని, కావున రోజుకు రెండు లేదా మూడు లారీలు వచ్చేలాగా చర్యలు తీసుకోవాలని దరఖాస్తు చేసియున్నారు.

జిల్లా కేంద్రంలోని సంజయ్ నగర్ కు చెందిన వీరస్వామి తనకు 65 సంవత్సరాలు అని, కూలి పని చేస్తుంటారని, నిరుపేద కుటుంబానికి చెందినవాడని, తన కుడి కన్ను కనపడదని, తన సదరం సర్టిఫికెట్ లో 40 శాతం వికలాంగుడని వచ్చిందని, తనకు ఎలాంటి ఆస్తిపాస్తులు లేవని, ఈ మేరకు వికలాంగుల పింఛను ఇప్పించగలరని ప్రార్థిస్తూ అర్జీ ద్వారా కోరారు.

జిల్లా కేంద్రంలోని 13వ వార్డుకు చెందిన చెరుకు శ్రీనివాస్ తాను వికలాంగుడని, 9 నెలల క్రితం ఓపెన్ హార్ట్ సర్జరీ అయిందని, తన ఇంటి వాల్యుయేషన్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తును సమర్పించినారు.

తొర్రూరు గ్రామం పాలకుర్తి మండలానికి చెందిన జి. నాగరాజు, తన ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉందని, ప్రభుత్వ పథకాల ద్వారా లభించే స్వయం ఉపాధి కోసం ఒక ఎలక్ట్రిక్ వాహనాన్ని మంజూరు చేయవలసిందిగా కోరుతూ దరఖాస్తు అందించనైనది.

ఈ ప్రజావాణిలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్, జెడ్పీ సీఈవో రంగా రావు, జనగామ మునిసిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, సీపీఓ చిన కోట్యా నాయక్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఈ ఆఫీస్‌లోనే అన్ని ఫైళ్లు

- **భౌతిక (ఫిజికల్) ఫైళ్ల నిర్వహణకు స్వస్తి పలకాలి**
- **డీఈఓ కార్యాలయంలో అన్ని సెక్షన్ల పరిశీలన**
- **డీఈఓ కార్యాలయం ఆకస్మిక తనిఖీ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**జనగామ, మన చౌరాస్తా :** ఈ ఆఫీస్‌లోనే అన్ని ఫైళ్ల నిర్వహణ ఉండాలని జిల్లా కలెక్టర్, విద్య శాఖ అధికారి సందీప్ కుమార్ ఝా పేర్కొన్నారు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మొదటి అంతస్తులో గల జిల్లా విద్యా శాఖ అధికారి (డీఈఓ) కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సందర్శించి, ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని అన్ని సెక్షన్లను పరిశీలించి, సిబ్బంది పనితీరు, సెక్షన్ ల నిర్వహణ, ఫైళ్ల నిర్వహణ విధానంపై ఆరా తీశారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. కార్యాలయంలో భౌతిక (ఫిజికల్) ఫైళ్ల నిర్వహణ ఉండకూడదని, అన్ని ఫైళ్లను డిజిటల్ విధానంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ ఆఫీసులోనే అన్ని ఫైళ్లు అందుబాటులో ఉండేలా సమగ్ర నిర్వహణ చేపట్టాలని స్పష్టం చేశారు. ప్రతి సెక్షన్‌లో రికార్డుల నిర్వహణ, ఫైళ్ల క్రమబద్ధీకరణ, పెండింగ్ అంశాల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఈ మేరకు కార్యాలయ వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు.



# నాణ్యమైన అందించడమే లక్ష్యం

- **విద్యా వారోత్సవాల్లో భాగంగా కేజీబీవీ సమ్మర్ క్యాంప్ సందర్శన**
- **జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



**జనగామ, మన చౌరాస్తా :** విద్యార్థుల భవిష్యత్‌కు నాణ్యమైన విద్యే బాట అని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మే 11 నుంచి 17 వరకు చేపట్టిన విద్యా వారోత్సవాల సందర్భంగా సోమవారం, జిల్లాలోని బచ్చన్నపేట మండల పరిధిలో గల కేజీబీవీలో నిర్వహిస్తోన్న వేసవి శిబిరాన్ని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సందర్శించారు. ఈ సందర్భంగా శిబిరంలో పాల్గొన్న బాలికలతో కలెక్టర్ ఆప్యాయంగా ముచ్చటించారు. విద్యార్థినుల అభిరుచులు, నేర్చుకుంటున్న అంశాల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజూ కొద్దిసేపు సమయం కేటాయించి, విద్యార్థినులకు స్పీడ్ మ్యాథ్స్ నేర్పిస్తానని కలెక్టర్ తెలిపారు. వేసవి సెలవులను జీవితాంతం గుర్తుండిపోయే అద్భుత అనుభవాల సమాహారంగా రూపకల్పన చేశామని కలెక్టర్ పేర్కొన్నారు. సమ్మర్ క్యాంప్‌లో పొందుపరిచిన ప్రతి అంశాన్ని ఆసక్తిగా నేర్చుకోవాలని, తమకు ప్రత్యేకంగా నచ్చిన రంగంలో నైపుణ్యం సాధించి, వివిధ పోటీల్లో ప్రతిభ కనబరచాలని విద్యార్థినులకు సూచించారు. ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి కట్టుబడి ఉందని, విద్యార్థులకు ఆధునిక సౌకర్యాలతో కూడిన విద్యను అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.





# ఇచ్చిన హామీల అమలు చేయాలి




**జనగామ, మన చౌరాస్తా :** తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ సమావేశం జనగామ జిల్లా కేంద్రంలోని విజయ ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర అధ్యక్షుడు పైళ్ల గణపతి రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ జెండా ఆవిష్కరించారు. సమావేశం ప్రారంభంలో అమరవీరులకు సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఎన్నికల హామీల మేరకు కనీస వేతనం అమలు చేయాలని, కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్ కార్యాచరణలో భాగంగా మే 20 నుంచి మండల, జిల్లా స్థాయి సమావేశాలు, జూన్ 1న ఎంపీడీవో కార్యాలయాల వద్ద ధర్నాలు, జూన్ 8న కలెక్టర్ కార్యాలయం ముట్టడి, జూన్ 15న మంత్రులు, ఎమ్మెల్యేల కార్యాలయాల ముట్టడి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ప్రకటించారు.

# కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన పెరుమాండ్ల



**చిల్పూర్, మన చౌరాస్తా** : చిల్పూర్ మండలం రాజవరం గ్రామంలోని ఐకేపీ కేంద్రాన్ని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ బాధ్యులు పెరుమాండ్ల వెంకటేశ్వర్లు (వెంకన్న) సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రైతుల సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు స్థానిక పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి

- రాబోయే 15 రోజుల్లో 90 శాతం మ్యాపింగ్ పూర్తి చేయాలి
- నిజమైన ఓటరు ఓటు హక్కు కోల్పోకుండా చర్యలు తీసుకోవాలి
- రాష్ట్ర ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి




**జనగామ, మన చౌరాస్తా :** ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా తాజా ఓటరు జాబితాను 2002 ఎస్ఐఆర్ జాబితాతో మ్యాపింగ్ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, ఎస్ఐఆర్ మ్యాపింగ్ పురోగతి గురించి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సంబంధిత అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో రాబోయే 15 రోజుల్లో కనీసం 90 శాతం మ్యాపింగ్ పూర్తి చేయాలని సూచించారు. ఘన్‌పూర్ (స్టేషన్), అశ్వారావుపేట వంటి నియోజకవర్గాలు ఇప్పటికే 80 శాతానికి పైగా మ్యాపింగ్ పూర్తి చేశాయని తెలిపారు. ఒడిశా రాష్ట్రం ఇప్పటికే 90 శాతం, కర్ణాటక 81 శాతం, మహారాష్ట్ర 68 శాతం మ్యాపింగ్ పూర్తి చేశాయని, తెలంగాణ ఇంకా వెనుకబడి ఉందని పేర్కొన్నారు. జిల్లా ఎన్నికల అధికారులు తమ బృందాలను ప్రోత్సహించి, మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. మ్యాపింగ్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధుల పాత్ర కేవలం ఇళ్ల గుర్తింపు, వ్యక్తుల గుర్తింపుకు మాత్రమే పరిమితం కావాలని స్పష్టం చేశారు. ప్రైవేట్ వ్యక్తులు ఎస్ఐఆర్ మ్యాపింగ్ నిర్వహిస్తున్నారనే భావన ప్రజల్లో కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ కోసం అవసరమైన డేటా ఎంట్రీ ఆపరేటర్లను అన్ని వనరుల నుంచి గుర్తించి నియమించుకోవాలని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రారంభమైన తర్వాత ప్రతిరోజూ ఫారాల పంపిణీ, సేకరణపై సమీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రజలకు తమ ప్రాంతంలోని బీఎల్ఓ ఎవరో తెలిసేలా చర్యలు తీసుకోవాలని, ఏ నిజమైన ఓటరు తన ఓటు హక్కు కోల్పోకుండా చూడాలని ఆదేశించారు. ముఖ్యంగా వీఐపీ, వీవీఐపీ ఓటర్ల పేర్ల మ్యాపింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రముఖుల పేర్లు తప్పాయనే సంచలన వార్తలు రాకుండా చూడాలని తెలిపారు. అన్ని ప్రభుత్వ ఉద్యోగుల పేర్లు కూడా తప్పనిసరిగా మ్యాపింగ్ చేయాలని ఆదేశించారు. మ్యాపింగ్ పురోగతిని పెంచేందుకు ప్రతి బుధవారం రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల మహిళల సహకారాన్ని కూడా వినియోగించుకోవాలని తెలిపారు. వీసీ అనంతరం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ.. జిల్లాలో ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో బీఎల్ఓల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ లక్ష్యాలకు అనుగుణంగా మ్యాపింగ్ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే రాజకీయ పార్టీలతో సమన్వయం చేసుకుంటూ పారదర్శకంగా ప్రక్రియ నిర్వహించాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, అర్హులైన ప్రతీ ఓటరు పేరు సక్రమంగా మ్యాపింగ్ అవ్వాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్, ఆర్డీవో వెంకన్న, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# ధాన్యం కొనుగోలులో ప్రభుత్వాలు విఫలం

- సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి
- జనగామ కలెక్టరేట్ ముందు సీపీఎం ధర్నా

**జనగామ, మన చౌరాస్తా :** ఆరుగాలం కష్టపడి పండించిన వరి, మొక్కజొన్న పంటలను కొనుగోలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి విమర్శించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను తక్షణం వేగవంతం చేసి జిల్లా రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ జనగామ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు సీపీఎం ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నెల రోజులుగా రైతులు కొనుగోలు కేంద్రాల వద్దే పడిగాపులు కాస్తున్నా అధికారుల్లో చలనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని ప్రాంతాల్లో రైస్ మిల్లర్లు తరుగు పేరుతో బస్తాకు రెండు మూడు కిలోల చొప్పున రైతులను దోచుకుంటున్నారని, కాంటా అయిన ధాన్యానికి లారీలు అందక కల్లాల్లోనే బస్తాలు చెదలు పడుతున్నాయని మండిపడ్డారు. కలెక్టర్ ప్రకటనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించాలని, ఇప్పటివరకు జిల్లాలో 40 శాతం కూడా సేకరణ జరగకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని కనకారెడ్డి ధ్వజమెత్తారు. ధర్నా సందర్భంగా నాయకులు కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. అనంతరం సివిల్ సప్లై డీఎం హతిరామ్ నాయక్, డీఎస్ఓలు ధర్నా వద్దకు వచ్చి రైతులకు హామీ ఇచ్చారు. ట్రాన్స్‌పోర్ట్ సమస్యలను సరిదిద్ది, వారం రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరిగేలా చూస్తామని, రైతులకు సకాలంలో డబ్బులు పడేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. ఈ కార్యక్రమంలో రాపర్తి సోమయ్య, సింగారపు రమేష్, సాంబరాజు యాదగిరి, ఇర్రి అహల్య, బొట్ల శేఖర్ తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# మెరుగైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యం

**కొడకండ్ల, మన చౌరాస్తా :** కొడకండ్ల ప్రభుత్వ పాఠశాలల్లో యంగ్ ఇండియా సమ్మర్ క్యాంపులు, విద్యా వారోత్సవాలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ దూలం మమత సతీష్ గౌడ్, ఎంఈఓ కేజియా రాణి మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రజాపాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మే 11 నుంచి 17 వరకు విద్యా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు సైన్స్ ప్రయోగశాలలు, ఉచిత అడ్మిషన్లు, పాఠ్యపుస్తకాలు, పోటీ పరీక్షలకు ప్రత్యేక తరగతులు, ఉపకార వేతనాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. వారం రోజులపాటు విద్యా అవగాహన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు భాను ప్రసాద్, శోభా, ఉపసర్పంచ్ షన్న, వార్డ్ మెంబర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





# ఇండ్ల గణనకు ప్రజలు సహకరించాలి


## సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్

**దేవరుప్పల, మన చౌరాస్తా :** మండల కేంద్రంలో జనగణన 2027లో భాగంగా నిర్వహిస్తున్న ఇండ్ల గణన (హౌస్ లిస్టింగ్ & హౌసింగ్ సెన్సస్) కార్యక్రమంలో ప్రజలు అధికారులకు సహకరించాలని గ్రామ సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్ కోరారు. మే 11 నుంచి జూన్ 9 వరకు ఈ కార్యక్రమం కొనసాగనున్నట్లు తెలిపారు. మొదటి దశలో ఇళ్ల వివరాలు, గృహ సౌకర్యాలు నమోదు చేస్తున్నారని చెప్పారు. తాగునీరు, విద్యుత్, టాయిలెట్ వంటి మౌలిక సదుపాయాల సమాచారాన్ని అధికారులు సేకరిస్తారని పేర్కొన్నారు. ప్రజలు అధికారులు అడిగే ప్రశ్నలకు సరైన సమాచారం అందించి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సెక్రటరీ ధర్మ సతీష్ రెడ్డి, సూపర్‌వైజర్ మదన్ మోహన్ రెడ్డి, ఎన్యుమరేటర్లు రాజన్న, స్వప్న, లలిత, వెంకటేష్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా హనుమాన్ ఇరుముడి

**రఘునాథపల్లి, మన చౌరాస్తా :** హనుమాన్ జయంతిని పురస్కరించుకొని రఘునాథపల్లి మండల కేంద్రంలోని మహాదేవ స్వామి ఆలయంలో హనుమాన్ దీక్షా స్వాములకు ఇరుముడి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారి పిండిపోలు శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో మాలధారులు ఇరుముడి కట్టుకుని, మహాదేవునికి ప్రత్యేక అభిషేకాలు మరియు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ కూరెళ్ల పెద్ద ఉపేందర్ గుప్తారేణుక దంపతులు మాట్లాడుతూ.. హనుమాన్ కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం వాసవి క్లబ్ మరియు వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో మాలధారులను శాలువాలతో సత్కరించి, తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి సభ్యులు బొల్లం అజయ్ మణికంఠ, సీనియర్ జర్నలిస్టు కందుల అనిల్ కుమార్, నరసింహ చారి, కోళ్ల సాయికుమార్ గౌడ్, నితిన్, సంతోష్, మరాటి శ్రీశైలం, కందుల మహీధర్ పటేల్, కూరెల్లి వేద కుమార్ గుప్తా దంపతులు, వినయ్ కుమార్ గుప్తా, లాగిశెట్టి లింగయ్య దంపతులు, గుర్రాల దిలీప్ కుమార్ పటేల్, యాదగిరి, హరీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




# జీజేసీలో విద్యా వారోత్సవాలు ప్రారంభం

**జనగామ, మన చౌరాస్తా :** తెలంగాణ ప్రభుత్వం "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా మే 11 నుండి 17 వరకు "విద్యా వారోత్సవాల ను తెలంగాణ ఇంటర్ విద్యా శాఖ, జనగామ డీఐఈవో ఆదేశాల మేరకు ధర్మకంచ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ నాముని పావని కుమారి అధ్యక్షతన విద్యా వారోత్సవాలు నిర్వహించారు. కళాశాల విద్యా వారోత్సవాలకు ముఖ్య అతిధిగా విచ్చేసిన జనగామ 15 వార్డు కౌన్సిలర్ మారబోయిన పాండు మాట్లాడుతూ కళాశాలలో ఇంటర్ పబ్లిక్ పరీక్ష ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులకు శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా ఇంటర్ బోర్డు వారు కళాశాల తరగతి గదులలో ఏర్పాటు చేసిన నాలుగు డిజిటల్ బోర్డ్స్ (ఇంటరక్టివ్ డిజిటల్ బోర్డ్స్ రెండు సామ్ సంగ్, రెండు ఎల్ జి కంపెనీవి ) ను కళాశాల ప్రిన్సిపాల్, స్టాఫ్ తో కలిసి ప్రారంభించారు. అనంతరం ప్రిన్సిపాల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కౌన్సిలర్ పాండు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఇంటర్ విద్యపై ఎక్కువ శ్రద్ధ చూపు




తూందని కళాశాల విద్యార్థులకు కూడా అల్పాహారం, మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయడం శుభ సూచకం అని దీనివలన ఇంకా అడ్మిషన్స్ పెరుగుతాయని అన్నారు. కళాశాల పరిసరాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో కళాశాల స్టాఫ్ సెక్రటరీ వై. శ్రీకాంత్ రెడ్డి, కళాశాల ఎన్ ఎస్ ఎస్ పోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ వస్కుల శ్రీనివాస్, మరిపెల్ల రవిప్రసాద్, కళాశాల స్టాఫ్ డాక్టర్ వరుధిని, గోక గణేష్, ముక్తాదిర్, కాపర్తి శ్రీనివాస్, తిరుమలేష్, రజిత, రేఖ, కరుణాకర్, సేవా, నాగేందర్,నీతా, సురేష్,జ్యోతి మరియు బోధనేతర సిబ్బంది ప్రసన్న, శ్రీనివాస్, రవి పాల్గొన్నారు.



# మహంకాళమ్మ దేవాలయ కమిటీ ఎన్నిక


**జనగామ, మన చౌరాస్తా :** జనగామ పట్టణంలోని ప్రముఖ దేవాలయం అయిన మహంకాళమ్మ ఆలయ కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలయ ప్రాంగణంలో 25వ వార్డు కౌన్సిలర్ పాముకుంట్ల ప్రసాద్ ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షులుగా రంగు వీరస్వామి గౌడ్, కార్యదర్శిగా ఆలేటి నరేందర్ గౌడ్ లను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. గౌరవ అధ్యక్షులుగా పాముకుంట్ల ప్రసాద్ కుమార్ గౌడ్, కోశాధికారిగా పాముకుంట్ల మధుసూదన్, సహాయ కార్యదర్శులుగా చీకట్ల నవీన్ గౌడ్, రంగు లక్ష్మణ్ గౌడ్, పాముకుంట్ల సందీప్, బండపల్లి సోమేశ్వర్, ఉపాధ్యక్షులుగా పాముకుంట్ల కృష్ణమూర్తి గౌడ్, కసాబు శ్రీనివాస్ గౌడ్, పాముకుంట్ల మధు, రమణ, సురుగు మధు,





గౌరవ సలహాదారులుగా పాముకుంట్ల కుమారస్వామి, దూలం సత్తయ్య, రంగు శ్రీనివాస్, కుర్రెముల రామక్రిష్ణ, మీడియా సభ్యునిగా నామాల శ్రీనివాస్ తో పాటు 12 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. అనంతరం జరిగిన సమావేశంలో అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తామని. ఇందు కోసం అందరూ కలిసి సహకారం అందించాలని కోరారు.



# జనగామలో లారీ డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం తరలింపులో జాప్యం కారణంగా ఓ లారీ డ్రైవర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ధాన్యాన్ని మిల్లుకు తరలించేందుకు మూడు రోజులుగా వేచి ఉండాల్సి వచ్చిందని, దీంతో వాహనానికి సంబంధించిన ఈఎంఐలు చెల్లించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ క్రమంలో తన లారీపైకి ఎక్కి తాడుతో ఉరి వేసుకునే ప్రయత్నం చేయగా, అక్కడే ఉన్న రాజు అనే హమాలీ కార్మికుడు అప్రమత్తంగా స్పందించి అతడిని అడ్డుకొని కాపాడాడు. ఘటనతో మార్కెట్ యార్డులో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

# ప్రారంభమైన విద్యా వారోత్సవాలు

**తరిగొప్పల, మన చౌరాస్తా :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా 17 మే 2026 వరకు నిర్వహిస్తున్నటువంటి విద్యా వారోత్సవ కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లాలోని అన్ని మండలాల వారిగా ఉన్నత పాఠశాలలో సమ్మర్ క్యాంపు నిర్వహించుటకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సమ్మర్ క్యాంప్ ప్రారంభించారు. కరివేద మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో తరిగొప్పుల ఉన్నత పాఠశాలలో సమ్మర్ క్యాంపు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి తరిగొప్పుల గ్రామ సర్పంచి అర్జుల జ్యోతి, ఎమ్మార్వో మోసిన్ మండల విద్యాశాఖ అధికారి శ్రీమతి జానకి తరిగొప్పుల మండల పరిధిలోని వివిధ గ్రామాల సర్పంచులు, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు ,6వ తరగతి నుండి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు పాల్గొన్నారు.




Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**